మాట ఇచ్చారు.. పింఛను పెంచారు

- సీఎం జగనన్నను మరోసారి ఆదరించండి
- జెడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయరెడ్డి



లబ్ధిదారులకు పింఛను అందజేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయరెడ్డి, ఎంపీపీ సురేష్‌బాబు

యాదమరి : ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి పింఛన్లు పెంచుతామని పాదయాత్రలో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని జెడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయరెడ్డి తెలిపారు. మాట తప్పని ముఖ్య మంత్రి మళ్లీ కావాలని, ఆయనను మరోసారి ఆదరించాలని కోరారు. యాదమరిలోని ప్రైవేట్ కల్యాణ మండపంలో గురువారం పెంచిన పింఛను నగదు పంపిణీ చేశారు. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో మండలంలో వెయ్యిమందికి కూడా పింఛన్లు వచ్చేవి కాదన్నారు. అదికూడా టీడీపీ సానుభూతిపరులకే పింఛన్లు మంజూర య్యేవన్నారు. జగనన్న పరిపాలనలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛను మంజూరవుతున్నట్టు చెప్పారు. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు అవ్వాతాతలకు పింఛన్‌ను రూ.2250 నుంచి రూ.3 వేలకు పెంచినట్టు వివరించారు. మండలంలో గతంలో 2 వేల మంది లబ్ధిదారులు ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య 7816కు చేరిందని చెప్పారు. తాజాగా 99 మందికి పింఛన్లు మంజూరైనట్టు పేర్కొన్నారు. మంచి చేస్తున్న జగనన్నకు ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి భోగంరెడ్డి, ఎంపీడీవో శివరాజ్, ఈవోపీఆర్డీ హరిప్రసాద్ రెడ్డి, ఎంపీపీ సురేష్ బాబు, వైస్ ఎంపీపీలు రవీంద్రబాబు, హరనారాయణ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు బంగారుపాళెంలో పింఛన్ల పంపిణీ

బంగారుపాళెం: మండల కేంద్రమైన బంగారుపాళెం గ్రామ సచివాలయం-1 ఆవరణలో శుక్రవారం ఉదయం 11 గంటలకు పింఛన్ల పంపిణీని ప్రారంభించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండలానికి 196 కొత్త పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. వికలాంగుల పింఛన్లు 75, ఒంటరి మహిళ-1, వితంతు 51, వృద్ధాప్య పింఛన్లు 69 ఉన్నాయని పేర్కొన్నారు.

అర్జీ ఇచ్చిన వెంటనే పింఛను మంజూరైంది



“ నా పేరు మహేశ్వరి. మాది సిద్దారెడ్డి పల్లె పంచాయతీ. నా భర్త ఐదు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. వితంతు పింఛను కోసం వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకున్నా. వెంటనే పింఛన్ మంజూరైంది. విద్యా దీవెనతో ఇద్దరు పిల్లలు ఉన్నత చదువులు చదువుతున్నారు. మా కుటుంబాన్ని సంక్షేమ పథకాలు ఎంతో ఆదుకుంటున్నాయి. జగనన్నకు రుణపడి ఉంటాము – మహేశ్వరి, సిద్దారెడ్డి పల్లె

జగనన్న మళ్లీ రావాలి



మాకు ఇచ్చే పింఛనును రూ.3 వేలకు పెంచి ఇస్తున్న జగనన్నకు నమస్కారం. ఇలాంటి వ్యక్తి మనకు ముఖ్యమంత్రిగా ఉండడం చాలా సంతోషంగా ఉంది. మా లాంటి వాళ్లకు ఎంతో ఆదరణగా ఉన్నారు. ఇలాంటి సీఎం కోసం ప్రాణాలు ఇవ్వడానికి కూడా సిద్ధంగా ఉన్నాం. అందరూ ఓటు వేసి మరలా సీఎంను చేసుకుందాం.

– కవిత, 184 గొల్లపల్లె దళితవాడ, యాదమరి మండలం

క్లుప్తంగా

సకాలంలో బిల్లులు అందజేయండి

బంగారుపాళెం: డ్రాయింగ్ ఆఫీసర్లు ఉపఖజానా కార్యాలయానికి సకాలంలో బిల్లులు అందజేయాలని బంగారుపాళెం ఉపఖజానా అధికారి హరిప్రసాద్ తెలిపారు. ఏపీ హెచ్‌ఎంల సంఘం ఆధ్వర్యంలో హెచ్‌ఎంలు గురువారం ఎస్టీవోను సన్మానించారు. డైరీ, క్యాలెండర్ అందజేశారు. ఎస్టీవో మాట్లాడుతూ ఉపాధ్యాయుల శాలరీ బిల్లులను సకాలంలో అందజేస్తే జీతాలు అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుల ఐదవ జోన్ ఉపాధ్యక్షుడు భాస్కర్‌రావు, హెచ్‌ఎంలు రాజేంద్రన్, చంగల్‌రెడ్డి, బేరినాథ్, నిర్మల, చిట్టెమ్మ, పార్థసారథి, అబ్దుల్‌సుభాన్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళం ఇస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి) : కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి నిత్యాన్నదానానికి గుంటూరు జిల్లా తెనాలికి చెందిన నాగరాజు, కుమారి కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళం అందజేశారు. వారికి ఆలయ అధికారులు స్వామివారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు శెట్టేరిలో జగనన్న ఆరోగ్య సురక్ష-2

బంగారుపాళెం: మండలంలోని శెట్టేరి గ్రామ సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో హరిప్రసాద్ తెలిపారు. సచివాలయం పరిధిలోని ప్రజలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

టీచర్లకు సన్మానం



మహిళా దినోత్సవంలో ఉపాధ్యాయులు

యాదమరి : మండలంలోని కాశిరాళ్ల ఉన్నత పాఠశాలలో గురువారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం లలిత ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఎంఈవో రుక్మిణి మాట్లాడుతూ పిల్లలకు అర్థమయ్యేలా పాఠ్యాంశాలను బోధించాలని సూచించారు. ఉపాధ్యాయులు గిరిప్రసాద్, విజయభాస్కర్, కనక ఆచారి, భాస్కర్ రెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈవో రుక్మిణి

యాదమరి : స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గురువారం ఏపీటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఎంఈవో రుక్మిణి ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేసి బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ టీఎఫ్ మండల అధ్యక్షుడు అమరనాథ్‌రెడ్డి, జగ్గమధు, ఉపాధ్యాయులు మహమ్మద్ గఫూర్, శివశంకర్, విజయకుమార్, కృష్ణమూర్తి, వెంటకరమణ, దాము, జగన్నాథం, మునీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో మామిడిలో అధిక దిగుబడి



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

గుడిపాల: మామిడి పంటలో కోతలు పూర్తయిన నేపథ్యంలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా హార్టికల్చర్ అధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం వసంతాపురం ఆర్బీకేలో మామిడిలో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మామిడిలో పురుగుల ఉద్ధృతి పెరిగిందని, వాటి నివారణకు కోతల అనంతరం కొమ్మల కత్తిరింపులు చేసి గాలి, వెలుతురు సోకేలా చేయాలన్నారు. ఉద్యాన పరిశోధన స్థానానికి చెందిన డాక్టర్ శేషకిరణ్ మాట్లాడుతూ మామిడిలో పూత, పిందె సమయంలో వచ్చే చీడలు, తెగుళ్లు, వాటి నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో రాజశేఖర్ రెడ్డి, హార్టికల్చర్ అధికారి వింధ్య, వ్యవసాయాధికారి మాధవి పాల్గొన్నారు.

ఉచిత స్వర్గ రథం ప్రారంభం



గుడిపాలకు వచ్చిన వైఎస్సార్ స్వర్గ రథం

గుడిపాల: మండలంలో మరణించిన వారి భౌతికదేహాలను ఉచితంగా తరలించేందుకు స్వర్గ రథంతో పాటు ఫ్రీజర్‌ను అందుబాటులో ఉంచినట్టు వైఎస్సార్ సీపీ నేతలు తెలిపారు. ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి గుడిపాల మండలానికి గురువారం వైఎస్సార్ ఉచిత స్వర్గ రథాన్ని అందజేశారు. దానికి గురువారం వైఎస్సార్ సీపీ నేతలు పూజలు చేసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మరణించిన వారికి దహన సంస్కారాలు చేసేందుకు పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా వారికి ఫ్రీజర్ బాక్స్, ఉచిత స్వర్గ రథం చాలా అవసరమన్నారు. ఈ క్రమంలోనే గుడిపాలకు కేటాయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్‌రాయల్, ప్రకాష్, గోళ్ల హరిప్రసాద్, నవీన్, రమేష్, మంజు, సెల్వం, క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

‘కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి’



డ్రోన్ల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

బంగారుపాళెం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్వ రచౌదరి కోరారు. వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో భాగంగా గురువారం ముంగరమడుగు, గుంతూరు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ అదిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. లబ్ధిదారులకు ఉజ్వల్ యోజన గ్యాస్ కిట్లు, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు పంటల సాగులో డ్రోన్ల వినియోగంపై వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి భానుప్రకాష్, సూపరింటెండెంట్ శ్రీధర్, ఏవో చిట్టిబాబు, డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం



కుప్పిగానిపల్లె లేఅవుట్‌ను పరిశీలిస్తున్న మధుసూదన్‌రెడ్డి

గుడిపాల: మండలంలో ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని స్పెషలాఫీసర్ మధుసూదన్‌రెడ్డి ఆదేశించారు. ఆయన గురువారం కుప్పిగానిపల్లె, గొల్లమడుగులో జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఇళ్ల పనులను వేగవంతం చేయాలన్నారు. లబ్ధిదారులతో మాట్లాడి సకాలంలో బిల్లులు వస్తున్నాయా లేదా అని ఆరా తీశారు. అనంతరం సచివాలయాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఎంపీడీవో రాజశేఖర్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ గణేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్‌కు ఆహ్వానం



జెడ్పీ చైర్మన్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న బలిజ సేవా సంఘం నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: ఈ నెల 7న పుంగనూరులో చేపట్టనున్న శ్రీకృష్ణదేవరాయల కాంస్య విగ్రహ ఆవిష్కరణలో పాల్గొనాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులును శ్రీకృష్ణదేవరాయ బలిజ సేవా సంఘం నాయకులు ఆహ్వానించారు. వారు గురువారం జెడ్పీ చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సీఈవో ప్రభాకర్‌రెడ్డిని మెప్మా పీడీ రాధమ్మ మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ చంద్రమోహన్

గుడిపాల : ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం కింద చేపట్టే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చంద్ర మహేష్ తెలిపారు. పాపసముద్రంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 55 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. గర్భిణులు క్రమంతప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యసిబ్బంది కవిత, చంద్ర, ప్రభావతిలు పాల్గొన్నారు.

ప్రతిభను గుర్తించేందుకే ‘ఆడుదాం ఆంధ్రా’



బంగారుపాళెం: తగ్గువారిపల్లెలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ వాణిప్రియ

బంగారుపాళెం: గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీసి, వారిని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు సన్నద్ధం చేయడానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు శ్రీకారం చుట్టారని సర్పంచ్ వాణిప్రియ, ఎంపీటీసీ హేమచంద్ర తెలిపారు. వారు గురువారం తగ్గువారిపల్లెలో క్రికెట్, వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గ్రామ సచివాలయాల పరిధిలో ప్రతిభ గల క్రీడాకారులను ఎంపిక చేసి మండలం, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలకు ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు రఘుపతిరాజు పాల్గొన్నారు.

యం.బండపల్లిలో..

పూతలపట్టు: మండలంలోని యం.బండపల్లి పంచాయతీ పరిధిలోని మైదానంతోపాటు చిటిపిరాళ్ల, పాలకూరు పంచాయతీల్లోనూ గురువారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ముఖ్య అతిథులుగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మంజునాథ్, హేమలత, పీడీలు కృష్ణ, డిల్లీరాణి తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాతో క్రీడకారుల్లో ఉత్సాహం



తవణంపల్లె : వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

తవణంపల్లె: మండలంలోని తవణంపల్లె, మత్యం, వెంగంపల్లె, పట్నంలో గురువారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఉత్సాహంగా నిర్వహించారు. పురుషులు, మహిళ విభాగంలో కోకో, బ్యాడ్మింటన్, క్రికెట్, వాలీబాల్ పోటీల్లో పోటాపోటీగా తలపడ్డారు.



తవణంపల్లె: బ్యాడ్మింటన్ ఆడుతున్న మహిళలు





బంగారుపాళెం: తగ్గువారిపల్లెలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు, పూతలపట్టులో..

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ జె.అరుణ

చిత్తూరు అర్బన్: మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికుల సమ్మె నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ప్రజలకు ఇబ్బంది లేకుండా పారిశుద్ధ్య పనులను సక్రమంగా చేపట్టాలని నగర కమిషనర్ జె.అరుణ ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. ఆమె గురువారం గాంధీ రోడ్డు కూడలి, చర్చి వీధి, పాత బస్టాండ్, కొండారెడ్డిపల్లి ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. చెత్త తరలించే వాహనాల డ్రైవర్లతో మాట్లాడారు. ఎక్కడా వ్యర్థాలు కనిపించకుండా తొలగించాలన్నారు. వ్యాపారులు, దుకాణదారులతో మాట్లాడి ఎక్కడపడితే అక్కడ చెత్త వేయవద్దని సూచించారు. అనంతరం నగరంలో పారిశుద్ధ్య పనుల నిర్వహణపై ప్రజారోగ్య విభాగం అధికారులతో సమీక్షించారు. చెత్త సేకరణ, రవాణాకు సంబంధించి ప్రత్యామ్నాయాలను ఉపయోగించుకోవాలన్నారు. రద్దీ ప్రాంతాలు, ప్రధాన కూడళ్లు, రహదారుల్లో ఎక్కడా చెత్తా చెదారం కనిపించకుండా చూడాలన్నారు. సహాయ కమిషనర్ గోవర్ధన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, నరసింహ, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ బాబు వ్యాఖ్యలపై దళితనేతల ఆగ్రహం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ దళిత నేతలు

తవణంపల్లె : సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు చేసిన వ్యాఖ్యలు సరి కాదని వైఎస్సార్ సీపీ దళిత నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు గురువారం సాయంత్రం తవణంపల్లెలో వైఎస్సార్ సీపీ దళిత నాయకులు సమావేశమయ్యారు. ఎంపీటీసీ డేవిడ్ మాట్లాడుతూ చిత్తూరు మండలంలో జెడ్పీటీసీగా ఓడిపోయిన ఎంఎస్‌బాబుకు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బీఫారం ఇచ్చి ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిపించారని గుర్తు చేశారు. నేడు దళిత ఎమ్మెల్యేకు అన్యాయం చేశారని వారిని విమర్శించడం తగదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మధుకుమార్ మాట్లాడుతూ సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి దళితులకు అన్ని రంగాల్లోనూ ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో దళితులను వర్గాలుగా చీల్చిన వీధిపాలు చేసిన ఘనత ఎంఎస్‌బాబుదేనన్నారు. అధిష్టానం తీసుకున్న నిర్ణయాన్ని గౌరవించి పనిచేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపైనా ఉంటుందని వివరించారు. అంతేగాని దళిత ఎమ్మెల్యేకు అన్యాయం చేశారని విమర్శించడం తగదని మండిపడ్డారు. ఇప్పటికైనా ఆరోపణలు మానుకోవాలని, లేకుంటే దళితులే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. నాయకులు మురుగన్, అనంతకుమార్, చిట్టిబాబు, మణిరాజ్, గురునాథం, గంగయ్య, చిన్నెయ్య పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికే జగనన్న ఆరోగ్య సురక్ష

తవణంపల్లె: పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో గురువారం ఆషా డే సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని హైరిస్క్ గర్భిణులను ప్రతి నెలా 9న పీహెచ్‌సీకి తీసుకువచ్చి పరీక్షలు చేయించాలన్నారు. పిల్లలకు సకాలంలో టీకాలు వేయించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. బీసీజీ వ్యాక్సిన్ సర్వేను వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రాజామణి, సీహెచ్‌వో భారతి, హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్, శ్రీహరి, రెడ్డెమ్మ, నిర్మలమ్మ పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న వీరరాఘవులునాయుడు

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులు పాఠశాల దశ నుంచే నూతన ఆవిష్కరణలపై దృష్టిపెట్టాలని తపోవనం ఆశ్రమ ఇన్‌చార్జి వీరరాఘవులునాయుడు తెలిపారు. నగరంలోని తపోవనం శ్రీ మళయాళ స్వామి సంస్కృత ఉన్నత పాఠశాలలో గురువారం పలమనేరుకు చెందిన మదర్ థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నూతన ఆవిష్కరణలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆలోచనలకు పదును పెట్టాలని చెప్పారు. సాంకేతికతను వినియోగించుకుని నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం గజలక్ష్మి, మదర్‌థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రామయ్య అక్షింతల పంపిణీ



వసంతాపురంలో ఇంటింటికీ అక్షింతలు అందజేస్తున్న రామభక్తులు

గుడిపాల: అయోధ్య రామయ్య అక్షింతలను గురువారం రాత్రి వసంతాపురం, రామభద్రాపురం, 189 కొత్తపల్లె గ్రామాల్లో ఇంటింటికీ అందజేశారు. వాటిని పూజలో పెట్టుకుని జనవరి 22వ తేదీన అయోధ్య రామమందిరం ప్రారంభం సమయంలో తలపై చల్లుకోవాలని రామ భక్తులు సూచించారు.

ఈవీఎం ఓటింగ్‌పై అవగాహన



ముంగరమడుగులో ఈవీఎం ద్వారా ఓటింగ్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బంగారుపాళెం: మండలంలోని దండువారిపల్లె, ముంగరమడుగు ప్రాథమిక పాఠశాల ఆవరణలో గురువారం ఈవీఎంల ద్వారా ఓటు వేయడంపై ప్రజలకు అవగాహన కల్పించారు. తమకు ఇష్టమైన గుర్తుకు ఓటు ఎలా వేయాలనే విషయంపై డిప్యూటీ తహసీల్దార్ ఇబ్రహీం వివరించారు.

గ్రామాల్లో మౌలిక వసతులు

- ఉపాధి హామీ నిధులతో పనులు
- చిత్తూరుకు రూ.60 లక్షలు, జిల్లాకు రూ.18.29 కోట్ల మంజూరు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి నిధులతో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా భారీగా నిధులు కేటాయిస్తోంది. తాజాగా చిత్తూరు మండలానికి దాదాపు రూ.60 లక్షలు మంజూరు చేసింది.

జిల్లాలో రూ.18.29 కోట్లతో 435 పనులు

జిల్లాలోని 31 మండలాల పరిధిలో 435 పనులకు ప్రభుత్వం ఉపాధి హామీ కింద రూ.18.29 కోట్లు మంజూరు చేసింది. ఈ క్రమంలో గుర్తించిన పనులు చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోనున్నారు. చిత్తూరు మండలానికి 8 పనులకు రూ.60 లక్షలు, గుడిపాలలో 4 పనులకు రూ.60 లక్షలు, జీడీనెల్లూరులో 32 పనులకు రూ.60 లక్షలు, కార్వేటినగరంలో 10 పనులకు రూ.60 లక్షలు, పాలసముద్రంలో 14 పనులకు రూ.60 లక్షలు, పెనుమూరులో 11 పనులకు రూ.60 లక్షలు, ఎస్ఆర్‌పురంలో 5 పనులకు రూ.60 లక్షలు, వెదురుకుప్పంలో 18 పనులకు రూ.60 లక్షలు, గుడుపల్లెలో 17 పనులకు రూ.56 లక్షలు, కుప్పంలో 7 పనులకు రూ.58 లక్షలు, రామకుప్పంలో 17 పనులకు రూ.60 లక్షలు, శాంతిపురంలో 17 పనులకు రూ.56.85 లక్షలు, నగరిలో 13 పనులకు రూ.58.25 లక్షలు, నిండ్రలో 12 పనులకు రూ.60 లక్షలు, విజయపురంలో 20 పనులకు రూ.56.23 లక్షలు, బైరెడ్డిపల్లెలో 23 పనులకు రూ.60 లక్షలు, గంగవరంలో 13 పనులకు రూ.47.05 లక్షలు, పలమనేరులో 14 పనులకు రూ.60 లక్షలు, పెద్దపంజాణిలో 18 పనులకు రూ.60 లక్షలు, వి.కోటలో 15 పనులకు రూ.60 లక్షలు, చౌడేపల్లెలో 19 పనులకు రూ.60 లక్షలు, పులిచెర్లలో 28 పనులకు రూ.60 లక్షలు, పుంగనూరులో 15 పనులకు రూ.60 లక్షలు, రొంపిచెర్లలో 17 పనులకు రూ.60 లక్షలు, సదుంలో 15 పనులకు రూ.60 లక్షలు, సోమలలో 11 పనులకు రూ.60 లక్షలు, బంగారుపాళ్యంలో 8 పనులకు రూ.57 లక్షలు, ఐరాలలో 11 పనులకు రూ.60 లక్షలు, తవణంపల్లెలో 10 పనులకు రూ.60 లక్షలు, యాదమరిలో 6 పనులకు రూ.60 లక్షలు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.


మౌలిక వసతులకు ప్రాధాన్యం

ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో గ్రామాల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ముఖ్యంగా సిమెంట్ రోడ్లు, కాలువలు, అప్రోచ్ రోడ్లు నిర్మించనున్నారు. పనులను పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ విభాగాలు పర్యవేక్షించనున్నాయి. నిధులు మంజూరైన నేపథ్యంలో ఆయా శాఖల మండల అధికారులు పనులకు సంబంధించిన అంచనాలను రూపొందించారు.

70 లక్షల పనిదినాలు పూర్తి

జిల్లాలో ఉపాధి హామీ నిధులు తగినంతగా ఉండడంతో ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 70 లక్షల పనిదినాలు పూర్తి చేశారు. కూలీలకు వేతనాల రూపంలో రూ.177.74 కోట్లు చెల్లించారు. అదేవిధంగా మెటీరియల్ రూపంలో రూ.81.70 కోట్లు ఇచ్చారు. ఇప్పటి వరకు మొత్తం రూ.272.16 కోట్లు ఖర్చు చేశారు. పనులు పూర్తయిన వెంటనే ప్రభుత్వం కొత్త పనులకు బిల్లులు చెల్లించనుంది.

త్వరలో పనులు చేపడతాం



పనులకు సంబంధించి నామినేట్ పద్ధతిలో వెండర్లను పిలిచాం. మండల స్థాయిలో చిన్న చిన్న పనులు చేస్తారు. మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్యం మెరుగు కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. త్వరలో పనులు మొదలు కానున్నాయి. ఇప్పటికే జిల్లాలో కోట్లాది రూపాయలతో భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

– చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఈ పంచాయతీరాజ్